క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



అడ్మిషన్ల కోసం ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

పలాస: విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని బ్రాహ్మణ తర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. పాఠశాలలో బాలికల జూనియర్ కళాశాలను ఈ ఏడాది నుంచి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు కళాశాలలో అడ్మిషన్లు కోసం ఉపాధ్యాయులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పదో తరగతి చదువుకున్న విద్యార్థినులంతా కళాశాలలోనే విద్యనభ్యసించాలని హెచ్ఎం కొర్ల వైకుంఠరావు కోరారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



ఎస్ఐ రమేష్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: నూతనంగా విధుల్లో చేరిన రూరల్ ఎస్ఐ వి.రమేష్‌ను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళా పోలీసులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మండలంలో శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, టి.బరంపురం సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బాకి లక్ష్మీనారాయణ, బర్రి బలరాంరెడ్డి, జి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి



అరుణ పతాకాన్ని ఎగురు వేస్తున్న నాయకులు

పలాస: కార్మికులు తమ హక్కులు కోసం పోరాడాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని నీలావతి గ్రామంలో మేడేను పురస్కరించుకొని బుధవారం అరుణ పతాకాన్ని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు జుత్తు వీరాస్వామి ఆవిష్కరించారు. అనంతరం రైతు కూలీ సంఘం నాయకుడు గొరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి.మాధవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వినోద్, పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు పి.కుసుమ, కుత్తుం హేమలత, జడ్డే అప్పయ్య, వంకల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ సంజీవరావు

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చెందిన స్థలంలో కొత్తగా అంబేడ్కర్ భవనం నిర్మాణానికి కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం కమిటీ అధ్యక్షుడు బోకర జడ్డన్న, కమిటీ సభ్యులు సామ సంజీవరావు, అక్కురాడ సురేష్, దేవాది రామారావు, కూన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో రైతులకు మేలు



డ్రోన్ కెమెరాను ప్రారంభిస్తున్న దృశ్యం

పలాస: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని బొడ్డపాడు పంచాయతీ సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ మద్దిల పాపారావులు అన్నారు. బొడ్డపాడు రెవెన్యూ పరిధిలోని భూముల సర్వేకు సంబంధించి డ్రోన్ కెమెరాను బుధవారం ప్రారంభించారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీనాకుమారి, వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు బుడత ధనరాజు, పత్తిరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

• సీఎంకు స్వాగతం



భోగాపురం విమానాశ్రయం శంకుస్థాపనకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విశాఖపట్నంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

\- టెక్కలి



భోగాపురం విమానాశ్రయం శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంను సత్కరించారు.

\- టెక్కలి

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వజ్రపుకొత్తూరు: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ అన్నారు. గ్రామంలోని వీధుల్లో బుధవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీల్లో ఉన్న చెత్తను తొలగించి, జేసీబీతో కాలువను తవ్వి మురుగు నీటిని బయటకు మళ్లించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తడి, పొడి చెత్తను బయట పారబోయకుండా ఇచ్చిన చెత్త బుట్టలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గూడ ఈశ్వరరావు, బూత్ కన్వీనర్ సీహెచ్ రాకేష్, వై.జోగారావు, తులసీరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మురికి కాలువలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

తక్షణ సాయం అందజేత

కంచిలి: మండలంలోని జలంత్రకోట సచివాలయం పరిధి సువాగడ పంచాయతీ కర్రిసాయి గ్రామానికి చెందిన అక్షయ దొళాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయం రూ.10 వేలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి చేతులమీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సబితా గొమాంగో, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, ప్రకాష్‌చంద్రపండా తదితరులు పాల్గొన్నారు.



తక్షణ సాయం అందజేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

రహదారి మరమ్మతులు చేపట్టాలి

సోంపేట: మండలంలోని మాకన్నపురం గ్రామ పంచాయతీ నుంచి ఉప్పరిపేట, జగతి కేశుపురం మీదుగా పాత్రకొండ పంచాయతీకి వెళ్లే రహదారి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు ఎంపీడీవోకు వినతిపత్రం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎల్.గోవిందరాజులు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

డీడీ జయరాజ్‌కు సన్మానం



డీడీ జయరాజ్‌ను సన్మానిస్తున్న ఏడీ లోకనాథం తదితరులు

కోటబొమ్మాళి: టెక్కలి పశుసంవర్ధక శాఖ అందించిన సేవలకు గానూ రాష్ట్రస్థాయిలో ఇటీవల ప్రథమ బహుమతి లభించిన విషయం తెలిసిందే. దీంతో స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో డీడీ జయరాజ్‌ను ఏడీ ఎం.లోకనాథం, సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పెడ్రిక్, కోట ధర్మారావు, ఎస్.శాంతారావు, వి.భానోజీరావు పాల్గొన్నారు.

ముగిసిన చెవిటమ్మతల్లి పండుగ



తిరుగుముఖం పడుతున్న భక్తులు



నరసన్నపేట: జనంతో రద్దీగా ఉన్న జమ్ములోని ప్రధానవీధి

సారవకోట: కిన్నెరవాడ గ్రామంలో గత నెల 30వ నుంచి జరుగుతున్న సిరిమాను పండుగలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున చెవిటమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించారు. పండుగ కోసం బంధువుల ఇళ్లక వచ్చి తిరుగుముఖం పట్టిన వారితో వడ్డినవలస నుంచి కిన్నెరవాడ, బుడితి నుంచి కిన్నెరవాడ వెళ్లే రోడ్లు జనంతో రద్దీగా మారాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

జమ్ములో అసిరి తల్లి అమ్మవారి పండగ..

నరసన్నపేట: జమ్ము గ్రామంలో అసిరితల్లి గ్రామ దేవత అమ్మవారి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. 20 ఏళ్ల తరువాత ఉత్సవాలను గ్రామ కమిటీ వైభవంగా నిర్వహించింది. పండుగ కోసం బంధువుల ఇళ్లకు వచ్చిన వారితో జమ్ము గ్రామం కిటకిట లాడింది. జాతీయ రహదారి (326ఏ)పై కొద్ది సమయం వాహనాలు స్తంభించాయి. పోలీసులు స్పందించి వాహనాలను క్రమబద్ధీకరించారు. గ్రామంలో మాకివలస పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు.



నరసన్నపేట: వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

కొత్తూరు: కుంటిభద్ర గ్రామదేవత చెవిటమ్మ తల్లి పండుగలు ముగిశాయి. ఐదురోజులు వైభవంగా పండుగలు జరిగాయి. చివరి రోజున జరిగిన విందు కార్యక్రమానికి బంధువుల ఇళ్లకు వచ్చిన వారితో గ్రామం కిటకిటలాడింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎస్ఐ ఎం.గోవింద పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



కొత్తూరు: జనంతో రద్దీగా ఉన్న కుంటిభద్రలోని ఒక వీధి

రేపటి నుంచి బైబిల్ ఎగ్జిబిషన్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పల్లివీధి జేఎస్ఎంబీ చర్చిలో ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు బైబిల్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు చర్చి ప్రతినిధి జీఎంఎస్ అనీల్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి క్రైస్తవులు హాజరవ్వాలని కోరారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అరుణ

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన తామాడ ఢిల్లెమ్మ కాశీబుగ్గ ఎస్‌పీవీ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. దీంతో ఆమెకు మే నెలలో మంజూరైన పింఛన్‌ను వలంటీర్ మద్దిల అరుణ ఆస్పత్రికి వెళ్లి బుధవారం అందజేశారు. వలంటీర్‌ను గ్రామస్తులు అభినందించారు.

'ఈకేవైసీ పూర్తి చేయాలి'

కాశీబుగ్గ: పలాస, వజ్రపుకొత్తూరు, మందస, నందిగాం మండలాల్లోని పింఛన్‌దారులు పలాస ట్రెజరీ ఆఫీస్‌కు ఈనెల 6వ తేదీలోగా సీఎఫ్ఎంఎస్ ఐడీ నంబర్లతో అనుసంధానం చేసి, ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ తమ్మినాన మాధవరావు, సెక్రటరీ నెమలిపురి అప్పారావులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉప ఖజానా కార్యాలయానికి ఆధార్ కార్డులు, ఫోన్ నంబర్లు, పీపీవో కాపీ, బ్యాంకు పాస్‌బుక్ తీసుకొని వెళ్లాలని సూచించారు.

నేటి నుంచి ఆంగ్ల శిక్షణ తరగతులు

సోంపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఉన్న భగత్‌సింగ్ గ్రంథాలయం ఆధ్వర్యంలో గురువారం నుంచి ఉచిత ఆంగ్ల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ ఉపాధ్యాయులచే నిర్వహించనున్న శిక్షణ తరగతులను, పరిసర గ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ తరగతుల్లో పాల్గొనే విద్యార్థులు 94932 92385, 96760 16480 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పదవులు కేటాయింపుపై హర్షం

కోటబొమ్మాళి: మండలంలోని కిష్టుపురం గ్రామానికి చెందిన బొడ్డు వెంకటరమణకు కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా, బడ్డిపేట, పెద్దబమ్మిడి గ్రామాలకు చెందిన మెట్ట శాంతారావు, మెండ కల్యాణిలను డైరెక్టర్లగా ప్రభుత్వం నియమించింది. దీంతో బీసీ కులాలకు అధిక ప్రాధాన్యమిస్తూ పదవులు కేటాయించడంపై మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నూక సత్యరాజ్, జి.నాగభూషణరావు, కాళ్ల సంజీవరావు, బొడ్డు అప్పన్న, సొదాం ప్రసాద్, సుంకరి జనార్దన, వెలమల హరిబాబు, సింగూరు నారాయణరావు తదితరులు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పదవుల కేటాయింపునకు సహకరించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రిన్సిపాల్‌గా గోవిందమ్మ



గోవిందమ్మ

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా గోవిందమ్మను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాల 2023–24 బ్యాచ్ ఆమె ఆధ్వర్యంలో ప్రారంభం కానుంది.

సేవలన్నీ ఒకేచోట



పై ఫొటోలో కనిపిస్తున్నవి కోటబొమ్మాళి మండలం జర్జంగి నుంచి జలుమూరు మండలం చల్లపేట మార్గంలో రేగులపాడు గ్రామం వద్ద రోడ్డు పక్కనే ఒకేచోట నిర్మాణం చేపట్టిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ భవనాలు. రేగులపాడు పంచాయతీ పంతులపేట, సొదాం పంచాయతీ సూర్యనారాయణపురం, లక్ష్మీనారాయణపురం గ్రామాల పరిధిలోని సుమారు 3,300 మంది జనాభాకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకేచోట అందజేసేందుకు వీటిని నిర్మించి ప్రారంభానికి సిద్ధం చేశారు.

\- టెక్కలి

13న జాతీయ లోక్ అదాలత్

కోటబొమ్మాళి: స్థానిక కోర్టు ఆవరణలో ఈనెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.భరణి బుధవారం తెలియజేశారు. అన్ని అంశాలకు చెందిన కేసులను రాజీ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. రాజీ పడిన కేసుల్లో కోర్టుఫీజు వాపస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 5న కోర్టు ప్రాంగణంలో ముందస్తు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ భరణి

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రంలో కొలువైన కంచమ్మ తల్లి ఆలయ విస్తరణలో భాగంగా నిర్మించ తలపెట్టిన ప్రహరీ నిర్మాణానికి నిర్మాణ దాత విజయ్‌కుమార్ అగర్వాల్ కుటుంబ సభ్యుల చేతులమీదుగా బుధవారం భూమిపూజ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్దిల ఆనంద్, ఉపాధ్యక్షుడు వంకల ఉమాపతి, మాజీ అధ్యక్షుడు జగదీష్ పట్నాయక్, వైద్యుడు కొంచాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సరోజనమ్మ, సర్పంచ్ సుజాత తదితరులు

టెక్కలి: పాఠశాలల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ అట్ల సరోజనమ్మ అన్నారు. టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి ఆంజనేయపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణానికి సర్పంచ్ గొండేల సుజాత ఆధ్వర్యంలో బుధవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, మండల ప్రత్యేకాహ్వానితుడు ఎస్.శంకర్, వార్డు సభ్యుడు తోట లోకేశ్వరరావు, నాయకులు బి.ధనుంజయ్, ఎ.రాహుల్, గ్రామస్తులు ఆదినారాయణ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక నృత్యాల ప్రదర్శన

ఇచ్ఛాపురం: గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. బుధవారం స్వేచ్ఛా నృత్య తరంగిణి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ సంస్కృతీ సాంప్రదాయల మిళితమైన భరతనాట్యం, కూచిపూడి నాట్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

నీలమణి దుర్గ ఉత్సవాలకు ఏర్పాట్లు



అమ్మవారి ఆలయం వద్ద అలంకరణ ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం కూడలిలో విద్యుత్ అలంకరణ కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి గుడి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా, ప్రధాన రహదారి కూడలిలో విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేయనున్నారు.